

కె. కె. రావ్

ఇది సుబ్రహ్మణ్యం చెల్లెలి కథ. తెలిపిన వారి కిందులో పాపమూ ఉంది ఫలమూ ఉంది.

ఆన 1929 డిసెంబరు 13 తేదీ లగాయతు సుబ్రహ్మణ్యం చెల్లెలు పంకజాక్షి తాలూకు శీలం పాడయిపోయింది. ఆ రోజున ఆ అమ్మాయి శరీరం దాని మొగుడయిన లక్ష్మీనారాయణ వశమయింది. లక్ష్మీనారాయణకు దొరికిన ఆడుదాని శీలం పాడుగాకుండా వుండటమనేది ఎన్నడూ జరగలేదు.

పంకజాక్షి భర్తకు అచ్చిరాలేదు. అది కాపరానికి వచ్చినరోజు లగాయతు లక్ష్మీనారాయణ తన పాపాలకు ఫలితం అనుభవించ సాగాడు. యములవాళ్ళు వైద్యుల రూపాన వచ్చి అతన్ని నానా బాధలూ పెట్టారు. అతని రక్తంలో అగ్నిహోత్రం ప్రవేశపెట్టారు. అతన్ని బల్ల మీద పడుకోబెట్టి కోశారు. రెండు నెలలయిన తరవాత లక్ష్మీనారాయణ గుర్తుపట్టటానికి వీలులేని స్వరూపంతో, మొహంమీది చర్మం తోలల్లే అయి, వేళ్లు శాశ్వతంగా కొంగర్లుపోయి ఒకకాలు పక్షవాతం పాలయి బయటపడ్డాడు.

వాడు ముందు ముందు ఆటే పాపాలు చెయ్యలేడని వైద్యులు భరవాసా ఇచ్చారు.

లక్ష్మీనారాయణ విషయంలో పుణ్యం గట్టుకున్న మహానుభావులెవరో తెలీదు కాని, చుట్టపక్కాలంతా — ముఖ్యంగా లక్ష్మీనారాయణ వేపువాళ్ళు — పంకజాక్షి కేసి చూశారు. "నువ్వే దీనికంతకీ కారణ" మన్నట్టు. పాపిష్టివాడు పాపఫలం అనుభవించటం ఎవరికీ ఇష్టంలేనట్టు కనపడ్డది. ఆ పాపఫలంలో పంకజాక్షికి పత్నీభాగం లేకపోవటం మరీ అన్యాయంగా కనిపించింది అందరికీ.

అయితే, నేనూ కామేశ్వర్రావూ చాలా సంతోషించాం. మేమా? మేమిద్దరమూ ఈ కథకు ప్రేక్షకులం. మమ్మల్ని వదిలెయ్యండి.

ఇక ముందు పంకజాక్షి గతేమిటి? వాడు — ఆ లక్ష్మీనారాయణ — దాంతో కాపరం చెయ్యటానికి పనికిరాడు'' అన్నాడు కామేశ్వర్రావు నాతో ప్రైవేటుగా.

"దాన్ని పెళ్ళాడటానికే పనికిరాదు వన్నడిగితే!" అన్నాను.

నా బుద్ధిమాంద్యానికి వాడు విసుక్కుని. 'అది సరే—వాడికి—వాడు—వాడితో అది—" అని తడువుకోసాగాను.

నా మిత్రుడు

"పోనీ, హాయిగా బ్రహ్మచర్యం ఆచరించి ఇంత పరమైనా సంపాదిస్తుంది!" అన్నాను.

"ఎంత అన్యాయం!"

"ఏమిటా అన్యాయం? నన్ను చూసి ఎవరూ జాలిపడరేం? నేను రోజూ చేసేది బ్రహ్మచర్యం కాదూ" అన్నాను

కాని, పంకజాక్షి బ్రహ్మచర్యం చెయ్యలేదు. ఆమాటకొస్తే నేనూ చెయ్యలేదు. కామేశ్వర్రావు నాతో మాట్లాడటం మానేశాడు—బొత్తిగా కాదు, వెనకటి మాదిరిగా.

పరస్త్రీ గమనం మహాపాతకమనీ, పరపురుష గమనం కూడా అటువంటిదేననీ కామేశ్వర్రావు నాకు వినపడేటట్టు అప్పుడప్పుడూ అంటూ వచ్చిన మాటల్నిబట్టి నేను గ్రహించగలిగాను.

నేను చాలావరకు కామేశ్వర్రావు వైఖరి సహించి ఊరుకున్నాను గాని అది రానురాను దుర్భరమయింది.

"ఒరే, కామయ్యా, నువ్వు కొందరు సోషలిస్టులల్లే మాట్లాడకు, నాకు బాగుండదు" అన్నాను.

"సోషలిస్టులకేం?" అన్నాడు కామయ్య పళ్ళుబిగబట్టి.

"అది నీకు చాలా అప్రస్తుతం. నువ్వు సోషలిస్టువా?"

"కాను. నువ్వే నన్ను సోషలిస్టన్నావు."

"నే నన్లేదు. సోషలిస్టల్లే అన్నాను."

"సోషలిస్టు లెట్లా మాట్లాడతారు?"

"నీమల్లే."

"నేనెట్లా—"

"సోషలిస్టల్లే."

"నేను సోషలిస్టల్లే మాట్లాడటంలేదు" అన్నాడు కామేశ్వర్రావు ఒక క్షణం ఆలోచించి.

"ఐతే ఎవరల్లే మాట్లాడతావు?"

అన్నాను. దాంతో కామయ్య ఎత్తయి నాడు.

వాదనలో గెలిచానన్నమాటే గాని కామయ్య చెప్పింది నిజమేనని నాకుకూడా తెలిసివచ్చింది. ఎవరూ లేరనుకుని కామయ్యగాడు పంకజాక్షి బుగ్గగిల్లటం నాకంట పడినప్పుడు.

అటుతరవాత పంకజాక్షి నన్ను చూసి నవ్వినప్పుడు నేను తిరిగి నవ్వలేదు అది మొహం తిప్పించి, తలవిసిరి, జడ రూడించి నామీద ఆగ్రహం విసిరింది. దాంతో నా కణత పగిలింది.

"ఒరే, కామయ్యా!" అన్నాను సౌమ్యంగానే.

"నేను నీ అంత దొంగస్వాములార్ని కాను. ఆడది రంకుతనం చేస్తే, హరి హరీ అని చెవులు మూసుకోను కాని, రంకుతనంలోకూడా ఒక నియమం ఉండాలి. ఎవడైనా ఒకడు—"

"ఒకడో, ఇద్దరో! అట్లా నియమంగా ఉండటం మంచిది! చెప్పు, చెప్పు!" అన్నాడు కామయ్య.

నా కోపంవచ్చి, వాడితో తాత్కాలికంగా మాట్లాడటం మానేశాను.

తరవాత కొన్నాళ్ళకు కామయ్య నాతో రాజీకి వచ్చాడు.

"ఒరే పంకజాక్షి చూశావా! మరీ అన్యాయమైపోతున్నది."

"పోనీ మనకెందుకు?" అన్నాను

"ప్రతి విషయంలోనూ మనం అట్లా ఉదాసీనంగా ఉండబట్టే సంఘం ఈ విధంగా అఘోరిస్తున్నది మన సుబ్రహ్మణ్యాని కెంత అప్రతిష్ఠో చూడు. ఫలానివాడి చెల్లెలు—"

మేమిద్దరమూపోయి సుబ్రహ్మణ్యాన్ని హెచ్చరించాము

"ఇంకోరు చేసేపన్లకి నన్ను సిగ్గుపడమంటే నావల్ల కాదు. నా సిగ్గంతా నేను చేసేపనికే చాలీ చాలకుండా వుంది" అన్నాడు వాడు. వాడు లెక్కలబియ్యే లెండి.

మొదట మొదట పరిసిపోయింది కాని కాలక్రమాన పంకజాక్షి అల్లరిపాలయింది. ఒకటి రెండుసార్లు పంకజాక్షిని పట్టుకున్నారు. ఒకసారి దానికి శాస్తికూడా చేశారు, చావగొట్టి మూలగదిలో కూర్చోబెట్టి బయటికి రానివ్వలేదు.

"అంతే కావాలి!" అన్నాడు కామయ్య.

"నా కళ్ల హారతికర్పూరం పెట్టినట్లు చల్లగా ఉన్నై" అన్నాను. కామయ్య చూడకుండా కళ్ళు తుడుచుకున్నాను.

అటుతరువాత పంకజాక్షిని పట్టపగ్గాలు లేకపోయినై. దాని మొగుడికి జరిగిన శిక్షే దానికీ జరిగింది ఇంకా అంతకన్న కూడా ఎక్కువే జరిగింది. ఆడది గనక.

"చూశావా. పంకజాక్షి పాపఫలం ఎట్లా అనుభవిస్తున్నదో!" అన్నాడు కామయ్య.

ముప



"పెద్దవాళ్లూరికే చెప్పారుట్రా?" అన్నాను.

"అంతే కావాలి దానికి!" అన్నాడు కామయ్య

"ఆమాట అనకు. నాకు చాలా కష్టం వేస్తుంది" అన్నాను.

కామయ్య నాకేసి ఆశ్చర్యంగా చూశాడు

"ఇంకా అంతకంటె పదింతలయినా పాపంలేదు" అన్నాను

కామయ్య తృప్తిపడ్డాడు.

పాపఫలం అనుభవించడం పూర్తి అయిన తరువాత పంకజాక్షి పవిత్రమైన ఆత్మమాదిరిగా తళతళ లాడసాగింది అసలే అందగత్తె. ఇప్పుడు తేరి చూడరానిదై పోయింది.

ఈ సంగతి కామయ్యకూడా గమనించాడు కామాలు. ఒకనాడు నాతో తనంతట తనే అది కాస్తా బయటపెట్టాడు.

"నేను నీ వెధవనీతి విని చెడ్డాను!" అని కామయ్య నిట్టూర్పు విడిచాడు.

పంకజాక్షికి తనహృదయం అర్పించడానికి వాడు చేసే ప్రయత్నాలు నేను గ్రహించగలిగాను. నేను గమనించినంత వరకు అది వాటి వేడికి కరగలేదు

ఆ సంగతి వాడే నాకు చెప్పాడు.

"పంకజాక్షి పతివ్రతలకన్నా పాడుగా తయారయింది అయినా నువుకూడా కదిలించి చూడు! ఏం జరిగిందో మాత్రం నాతో చెప్పు!" అన్నాడు కామయ్య

రెండు రోజులైన తరవాత కామయ్య మళ్ళా నాతో ఈ ప్రస్తావన ఎత్తినప్పుడు "లాభంలేదురా కామయ్యా! ఇప్పటి పంకజాక్షిని చూపి ఆకాశంలో అరుంధతికూడా బయటికి రావటంలేదు" అన్నాను.

"మొగుడి దగ్గిరికి పోతుందిట్నా?"

"పోదుట."

"ఈ మొగుడులేని పాతివ్రత్యం చూస్తే నాకు మండిపోతుంది" అన్నాడు కామయ్య. "ఏం చేస్తుందిటా?"

"నేను చెప్పిన బ్రహ్మచర్యమేమో!" అన్నాను.

"నీ మాటంటే దాని కంత గురేం?" అన్నాడు కామయ్య

తరవాత ఒక నెలకు పంకజాక్షి మాయమయింది. మరి రెండు రోజులకు తెలిసింది, పంకజాక్షి ఎవరితోనో లేచి పోయిందని. ఆయన ఎవరో డిప్టీ కలెక్టరుట. భార్య పోయిందిట, నడి వయస్సు వాడుట.

"ఆయనకూ దీనికీ ఎట్లా లంగరందిందో నే నూహించుకో లేకుండా వున్నాను" అన్నాడు కామయ్య.

నేను మాట్లాడలేదు.

"ఇక దాని పాట్లు కుక్కలూ నక్కలూ పడవు" అన్నాడు కామయ్య తన దివ్య దృష్టితో చూసి.

"ఇది అదివరకు మాట. ఇక కుక్కలూ, నక్కలూ పడేపాట్లు అది పడదు." అన్నాను.

"నీ కెట్లా తెలుసు?"

"నీ కెట్లా తెలుసూ, అది పడే పాట్లు కుక్కలూ నక్కలూ పడవని?"

"ప్రశ్నకు ప్రశ్న వెయ్యకు!"

"నువ్వు కాంగ్రెసు వాళ్లల్లే మాట్లాడకు" అన్నాను

"కాంగ్"—నాకేసి ఒక్కసారిచూపి బుద్ధిమార్చుకుని కామయ్య విషయంకూడా మార్చాడు.

"ఆ డిప్టీ కలెకటేరు ముసిలివాడై ఉంటాడు."

"కట్టుడు పళ్ళుట" అన్నాను.

"కోతి అయివుంటాడు" అన్నాడు కామయ్య.

"నేనది ఒప్పుకోను. రెండూ ఇవ్వటం అన్యాయం. వాడికి ముసలితనమన్నా ఇదాం, లేదా కురూపితనమన్నా ఇద్దాం. రెండూనా?" అన్నాను.

"రెండూనూ!" అన్నాడు కామయ్య ఖచితంగా.

"పోనీ, వోటుకు పెడదాం తీర్మానాన్ని" అన్నాను.

"చాలా అనవసరం. ఆ డిప్టీ....దాన్ని రోజూ చంపుకు తింటాడు. వాడు చావగానే దాని పాట్లు కుక్కలూ నక్కలూ పడవు" అన్నాడు కామయ్య.

"పడతై." అన్నాను.

"నీకంతా వేళాకోళంగా వుంది." అన్నాడు కామయ్య.

"నీకే వేళాకోళంగా వుంది. ఆ డిప్టీ... వాడు పదివేల ఇన్సూరెన్సు పాలసీ పంకజాక్షికి ఎస్సైను చేశాట్ట"

"నీకెట్లా తెలుసు"

"చెయ్యలేదని నీకెట్లా తెలుసు?" అన్నాను

"నీతో మాట్లాడటం నాదే బుద్ధి పొర పాటు!" అన్నాడు కామయ్య.

"ఉండుండు. ఈ ఒక్కముక్కా విని నాతో మాట్లాడటం మానివెయ్యి. పంక జాక్షి నాకు ఉత్తరం రాసింది. రేపాది వారంనాడు నిన్నూ నన్నూ బయలుదేరి రమ్మన్నది. వాళ్ళింట్లో రెండురోజులుండి పొమ్మన్నది."

"నీకు రాసిందా?"

"ఇదుగో ఉత్తరం."

"నాకెందుకు రాయలేదూ?" అన్నాడు కామయ్య.

"రేపు వెళ్ళి స్వయంగా కనుక్కుం దాం." అన్నాను.

రాను రానంటూనే కామయ్య నాతో బయలుదేరాడు పంకజాక్షినీ, డిప్టీ కలె క్టరునూ చూడటానికి.

పంకజాక్షి ఇల్లు వైభవంగా వుంది. పదిమంది నౌకర్లూ, పెద్దమేడా, కుర్చీలూ, ఇంటోనే క్రోటన్లూ, వాకిళ్ళకూ కిటికీ లకూ అందమైన పరదాలూ అదీను. డిప్టీ కలెక్టరుగారి దబ్బంతా ఇదే వాడటం. ఆయన ముప్ఫయిరెండేళ్ళవాడు. అంత అందమైనవాణ్ణి నేను చూడలేదు. అతనూ, పంకజాక్షీ పక్కపక్కనే నిలబడితే రాజూ, రాణీ లాగే ఉన్నారు. అతను పంకజాక్షిని పువ్వుల్లోపెట్టి పూజిస్తున్నా డని రుజువయింది. వాళ్ళిద్దరూ క్షణాని కోసారి కీచులాడుకోవటం చూస్తే కామ య్యకు ముచ్చటెయ్యలేదు.

మేం వెళ్ళేటప్పటికి డిప్టీ కలెక్టరుగారు ఒక నిక్కరూ, బనీనూ వేసుకుని లోడీలు తిప్పుతున్నాడు. అతని కండరాలు సము ద్రపు అలలల్లే తిరుగుతుంటే కామయ్య కళ్ళు తిరిగినై.

అతను పంకజాక్షితో మాట్లాడినట్లు మాతో మాట్లాడలేదు. ఎటాగైనా మా దగ్గర కాస్త హోదా కనబరిచాడు. పంక జాక్షిమాత్రం మాతో మామూలుగానే మాట్లాడింది.

మే మక్కడవున్న రెండురోజులూ చాలా హాయిగా గడిచినై. మేం వచ్చే టప్పుడు డిప్టీకలెక్టరుగారు మా ఇద్దరి చేతులూ మథించి, నాతో 'మీ ఉపకారం ఎన్నటికీ మరవను. మీరు అప్పుడప్పుడూ వస్తూ ఉండండి." అని లాంఛనంగా అన్నాడు.

బయటికి రాగానే కామయ్య "నువ్వా యనకు చేసిన ఉపకారమేమిటో కాస్త చెబుతావా?" అన్నాడు.

"పంకజాక్షి ఆయనతో లేచిపోవ టానికీ నాకూ ఏమీ సంబంధంలేదు" అన్నాను.

"ఆ సంగతి తెలుస్తూనేవుంది. ఆ విషయం నీతో దీర్ఘంగా మాట్లాడాలి పద!" అన్నాడు కామయ్య

"నువ్వుపో. నేను నీవెంట రాను. నేను తరవాత బండికి వస్తాను." అన్నాను.